ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
03-09-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 04 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి




# అంతా జలమయం

✍ **జయభేరి, హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం:**

కుండపోత వర్షాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, సమీపంలోని విజయవాడ నగరం రెండూ నీట మునిగాయి.కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలలో అనేక గ్రామాలు, పట్టణాలు వరద ప్రభావానికి లోనయ్యాయి.విజయవాడలో బుడమేరు పొంగడంతో సింగ్‌నగర్, వాంబేకాలనీ, రాజరాజేశ్వరిపేట సహా అనేక ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి.కృష్ణలంక, ఇబ్రహీంపట్నం, జూపూడి, ఫెర్రీ తదితర ప్రాంతాలూ నీట్లో ఉన్నాయి.పులిగడ్డ, చిరుకుల్లంక, యడ్లలంక తదితర గ్రామాలలోని ప్రజలను ఇప్పటికే పునరావాస శిబిరాలకు తరలించారుబాధితుల కోసం హెలికాప్టర్లలో ఆహార పదార్థాలను జారవిడుస్తున్నారు. కృష్ణానదిపై ఉన్న ప్రకాశం బ్యారేజ్‌కు పైనుంచి నీటి రాక భారీగా ఉండడంతో 70 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు.ఇప్పటివరకు 11,20,101 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు అధికారులు ప్రకటించారు.విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ఇళ్లలో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.ఇందుకోసం మచిలీపట్నం నుంచి సుమారు 100 బోట్లు, పడవలను తెప్పించారు. వీటిని రోడ్డు మార్గంలో లారీలు, వ్యాన్లపై తీసుకొచ్చారు.సహాయ సిబ్బంది ఈ పడవలు, బోట్లలో వెళ్లి బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చుతున్నారు.మరోవైపు తెలంగాణ రాష్ట్రంలోనూ ఎడతెగని వర్షాలు తీవ్ర నష్టం మిగిల్చాయి.

...మిగతాది 2 లో

## మున్నేరు, బుడమేరు ఉగ్రరూపం

✍ **జయభేరి, విజయవాడ, హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు జనజీవనానికి ఆటంకంగా మారాయి. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలో వానలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఏర్లు, నదులకు భారీగా వరద నీరు చేరడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.బుడమేరు వరద ఉధృతితో విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. భారీ వర్షాలు, వరదలకు విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు కాగా, కొన్నింటిని దారి మళ్లించారు.కొండపల్లి, రాయనపాడులో రైలుపట్టాలపై వరదతో, ట్రాక్‌పైనే రైళ్లు నిలిచిపోయాయి. బస్సుల్లో ప్రయాణికులను అధికారులు తరలించారు.భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బాధితులను పరామర్శించేందుకు విజయవాడ సింగ్ నగర్‌లో ఆయన పర్యటించారు. బుడమేరు ఉప్పొంగి ప్రవహించడంతో సింగ్ నగర్ జలదిగ్బంధంలో చిక్కుకుంది.విజయవాడలో ఇంత పెద్ద విపత్తును తాను ఎన్నడూ చూడలేదని చంద్రబాబు అన్నారు.వరద పరిస్థితిపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

2 లో

## సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ ఫోన్

» అప్రమత్తంగా ఉండాలని సూచన



✍ **జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణలో వరద తీవ్రత ఎలా ఉందంటూ ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి రాష్ట్ర స్థితిగతులను ఆరా తీశారు. రాష్ట్రంలో వరద పరిస్థితులు, జరిగిన నష్టాన్ని ప్రధాని మోడీ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షం, వరదలతో వాటిల్లిన అపార నష్టాన్ని ప్రధాని దృష్టికి సీఎం రేవంత్ తీసికెళ్లారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలను, తీసుకున్న జాగ్రత్తలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీకి వివరించారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించినట్లుగా ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముందస్తు చర్యలతో ప్రాణనష్టం సంభ వించకుండా అప్రమత్తంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని మోడీ అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలందించే హెలీకాప్టర్లను పంపిస్తామని ప్రధాని మోడీ హామీని చ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవరసమైన వరద సహాయక చర్యలను చేపట్టనున్నట్లు ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్

» వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం



✍ **జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించడం అన్యాయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

...మిగతాది 2 లో




## జాతీయ విపత్తుగా ప్రకటించండి

» ఆదుకోవాలని రేవంత్ వినతి

✍ **జయభేరి, ఖమ్మం, సెప్టెంబర్ 2:**

భారీ వర్షాలతో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం.. లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణ, పంట నష్టాలతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లినందున స్వయంగా పరిశీలనకు రావాలని ప్రధానమంత్రిని కోరుతూ లేఖ రాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. అతి తక్కువ సమయంలో ఇంత భారీ వర్షాలు కురవడానికి కారణాలు, రేపటి పరిస్థితులపై వాతావరణ శాఖ అధికారులను అడిగారు. ఊహించిన దానికన్నా ఎక్కువ వర్షాలు వచ్చాయని, గతంలో అయిదేళ్లకో, పదేళ్లకో ఇలా వచ్చేవని.. ఇటీవల తరచూ వస్తున్నాయని, దీనిపై మరింత అధ్యయనాలు జరుగుతున్నాయని

...మిగతాది 2 లో

## హైడ్రాతో వెన్నులో వణుకు

**హైదరాబాద్, ఆగస్టు 2:**

తెలంగాణలో ఇప్పుడు హైడ్రా పేరు చెబితే చాలు ఆక్రమణదారుల వెన్నులో వణుకు పుడుతోంది. నగరంలో చెరువులను ఆక్రమించిన బడా బాబులు, రాజకీయనేతల బంధువులు, చివరికి అధికార పార్టీ నేతల్లో సైతం హైడ్రా తీరుతో ఆందోళన నెలకొంది. ఇదిలా ఉంటే కూల్చివేతలలో భాగంగా ఇప్పటి వరకూ N కన్వెన్షన్ వంటి సెలబ్రెటీల ఆస్తులనే కాదు, పేదల గుడిసెలు, ఇళ్లు సైతం హైడ్రా




2 లో

## కేరళ రాజకీయాల్లో మీ టూ...

✍ **జయభేరి, తిరువనంతపురం, సెప్టెంబర్ 2:**

మహిళా నేత ఆరోపణలతో కేరళ కాంగ్రెస్‌లో రాజకీయ కలకలం రేగుతోంది. కేరళ కాంగ్రెస్‌లో పరిస్థితి సినీ పరిశ్రమ 'కాస్టింగ్ కౌ'లా ఉందని కాంగ్రెస్ నేత సిమి రోజ్‌బెల్ జాన్ ఆరోపించారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి హేమా కమిటీ నివేదిక సంచలనం సృష్టిస్తోంది. ఆ నివేదిక వచ్చిన తరుణంలో కాంగ్రెస్ నాయకురాలి నుంచి ఈ ప్రకటన వచ్చింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న



2 లో



## భారీ వర్షాలపై సీఎం రేవంత్ అలెర్ట్

» ప్రజలకు విజ్ఞప్తి

» అధికారులకు కీలక ఆదేశాలు..

✍ **జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి ఈ వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మరోవైపు సీఎస్, డీజీపీ మున్సిపల్ కరెంట్, పంచాయతీ రాజ్ హైడ్రా, ఇరిగేషన్ అధికారులు కూడా పాల్గొనడం జరిగింది. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని టెలి కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు ఎస్పీలు రెవెన్యూ ఇరిగేషన్, మున్సిపల్

...మిగతాది 2 లో

## ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది

» మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



✍ **జయభేరి, హైదరాబాద్:**

ప్రజలు కష్టాల్లో ఉన్నారు సహాయక చర్యల కోసం ఆర్తిగా ఎదురుచూస్తున్నారు. ఇంట్లో వరద నీరు, కంట్లో ఏడతెగని కన్నీరు. వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ప్రభుత్వం కొంతకాలం శుష్క రాజకీయాలు, కూల్చివేతలను ఆపి బాధితులను ఆదుకోవడం పై సంపూర్ణంగా దృష్టి కేంద్రీకరించాలి. ఇప్పటికే తక్షణ సహాయ చర్యలు అందలేదని జనం తమ ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

...మిగతాది 2 లో

# ఘనంగా వైఎస్ ఆర్ వర్ధంతి వేడుకలు

- వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు
- పేద ప్రజల హృదయాల్లో వై ఎస్ ఆర్ చెరగని ముద్ర వేశారు - జైపాల్ రెడ్డి

**జయభేరి, సెప్టెంబర్ 2:**



మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 15 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరై వైయస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ 4 వ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప మహానుభావుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, అందించి విద్యుత్ బకాయిలు మాఫీ చేయించారని గుర్తు చేశారు. అదేవిధంగా రైతులకు రుణాలు మాఫీ చేసి, సరైన సమయంలో సబ్సిడీ విత్తనాలు అందివ్వడం, మహిళలకు పావుల వడ్డీకే రుణాలు,వృద్ధులకు, వితంతులకు అర్హులైన వారందరికీ ప్రతి నెల 200 వందల పింఛన్,వికలాంగులకు 500 వందల పింఛన్,అభయ హస్తం కింద 60 సంవత్సరాల మహిళలకు పింఛన్లు అందించారని వెల్లడించారు. ఇక రెండు రూపాయల కే కిలో బియ్యం, జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు చేపట్టి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించారన్నారు. 108 అత్యవసర అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి వందలాదిమంది నిరుపేదల ప్రాణాలు కాపాడిన దేవుడు అని కొనియాడారు. అంతేకాక 104 అంబులెన్స్లు ఏర్పాటు చేసి ప్రతి నెల రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో నిరుపేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేయించారన్నారు. ముఖ్యంగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే విధంగా సహాయం అందించారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి(CMRF) కింద లక్షలాదిమంది నిరుపేదలకు కోట్లాది రూపాయలు అందించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ప్రతి విద్యార్థి పై చదువులు చదివేందుకు గాను ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టరన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంతో రాష్ట్రంలోని అర్హులైన వారందరికీ ఇళ్లు, మరియు అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు అందించారని వెల్లడించారు. అదేవిధంగా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం మరియు ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని వివారించారు. కాగా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు అందించిన విధంగా ప్రజాపాలన అందిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవరయాంజాల్ మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్, కందాల రాము, మున్సిపల్ కాంగ్రెస్ కార్యదర్శి తిగ్గుళ్ళ మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు భీమిడి కోండల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శి తిగ్గుళ్ల దర్శన్ గౌడ్, వార్డుల కాంగ్రెస్ అధ్యక్షులు తలగామ జగన్, గుడిసేని హరికృష్ణ, నాలిక మహేందర్, గొడుగు బాలకృష్ణ, నాయకులు మిర్యాలకర్ సాయి కుమార్, శ్రీనివాస్, నానిగళ్ల రవి, పోసపల్లి సాయిలు, వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు గుడిసేని సాయి కృష్ణ, కొత్తపేట భరత్ రెడ్డి, మామిడ్ల హరివర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి పట్టణంలో సోమవారం శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ భగవత్ కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై ముత్యాల రామ్మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి కార్యక్రమాలతో ప్రజలలో సత్ప్రవర్తన పెరుగుతుందని భక్తి భావం పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంచుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. ఆగస్టు 26వ తేదీన నల్గొండ రోడ్డులో ఎస్ ఎల్ బి సి ఆఫీసు వద్ద మండపాన్ని ఏర్పాటు చేసి శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువు తీర్చారు. నేటితో పూజలు పూర్తి కావడంతో శ్రీకృష్ణ భగవానుడు ఊరేగింపును పట్టణంలో భాజా బజంత్రీలు, తాళ మేళాలు, పురోహితులతో శ్రీకృష్ణుడి భజనలతో భక్త బృందంతో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు, పూలు, ఫలాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు, పగిడిమర్రి వెంకటేశం, మేకల శ్రీనివాసులు,ముత్యంరెడ్డి, ఊట్కూరి వేమన్ రెడ్డి, పసునూరి యుగంధర్ రెడ్డి ,చంద్రమౌళి, చక్రధర్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, శ్రీనివాస్, ఈదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుతు షాక్ తో ప్రిన్సిపాల్ మృతి



**జయభేరి, ఘట్కేసర్:**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి కొండాపూర్ విజ్ఞాన్ స్కూల్ లో షార్ట్‌సర్క్యూట్ తో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. విజ్ఞాన్ స్కూల్ లో అల్పాహారం తీసుకున్న తర్వాత తిరిగి తన క్వార్టర్స్ కు చేరుకొని క్వార్టర్స్ పైభాగంలో నీరు నిల్వ ఉండడంతో రాడ్డుతో నీటిని తొలిగిస్తుండగా క్వార్టర్స్ పైభాగం ఉన్న విద్యుత్ వైర్లకు రాడ్డు తగిలి షాట్ సర్క్యూట్ తో అక్కడికక్కడే మృతి చెందిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు..
ఖమ్మంకు చెందిన శ్రీనివాసరావుకు స్కూల్ యాజమాన్యం కేటాయించిన క్వార్టర్స్ లో ఒంటరిగా ఉంటూ, స్కూల్ లో విద్యార్థులకు బోధన చేస్తు విధులు నిర్వహిస్తున్నాడు..సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అదే కళాశాలలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడు రాజేష్ స్కూల్ పై భాగంలో పడి ఉన్న శ్రీనివాసరావును గమనించి వెంటనే యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అరుదైన గౌరవం

- ఇండియా ఇంపాక్ట్ 2024 అవార్డును కైవసం చేసుకున్న జిల్లా వెల్ఫేర్ కమిటీ
- హర్షం వ్యక్తం చేసిన చైర్ పర్సన్ ఏ ఏం రాజారెడ్డి

**జయభేరి, సెప్టెంబర్ 2:**




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి జాతీయస్థాయిలో మొదటి రన్నర్ అప్ గా ప్లాన్ ఇండియా ఇంపాక్ట్ 2024 అవార్డు దక్కింది. గత 4 సంవత్సరాలుగా బాలల హక్కుల చట్టాల అమలుకు విశేషంగా కృషి చేస్తున్నందుకు గాను ఈ అవార్డు లభించిందని చైర్ పర్సన్ ఏ ఎం రాజారెడ్డి తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాలల పునరావాసం, పురానికరణ వారి వంతు సహాయ సహకారాలు, బాలల హక్కులు, బాలల చట్టాల మేరకు వారి కర్తవ్యం నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. తమ సాఫల్యాన్ని గౌరవించడానికి ట్రోఫీతో పాటు సర్టిఫికెట్ అందజేసేందుకు పిఐఐఏ బృందం త్వరలో చేరుకుంటుందని సమాచారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి. ఎన్. రామ్ మోహన్, కె. నాగ జయశ్రీ, ఎం. అర్చన, పి. జయశీల తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ న్యాయవాదులపై వివక్షకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన

**జయభేరి, దేవరకొండ :**



ఎస్సీ న్యాయవాదులపై వివక్షకు వ్యతిరేకంగా దేవరకొండ న్యావాదులు కోర్టు ఆవరణలో నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. దేవరకొండ కోర్టులో నూతనంగా సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా బార్ ప్రెసిడెంట్, కార్యదర్శి ఎస్సీ న్యాయవాదులపై వివక్ష చూపిస్తూ, కనీసం వారిని వేదిక పైకి పిలవకపోవడం, మిగతా న్యాయవాదులలాగా వారికీ అవకాశం కల్పించకపోవడం చూస్తుంటే కావాలనే ఎస్సీ న్యాయవాదులపై వివక్ష చూపిస్తున్నారని స్పష్టంగా కనిపిస్తున్నది అని అన్నారు , దీనిపై వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాక పోగ,పైగా వారిపై నిందలు వెయ్యడం చేస్తున్నారని అన్నారు. కోర్టు పరిధిలో కార్యక్రమం నిర్వహించుకుంటూ కనీసం న్యాయవాదులకే సమాచారం ఇవ్వకుండా, పైగా వారికీ ఏమి సంబంధం లేదు అనే భావనతో ఉన్నారని తెలిపారు.దీనిపై త్వరలో సంబంధిత అధికారులను కలిసి విన్నాపిస్తామని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులు వస్కుల శ్రీనివాస్,మాతంగి సురేష్, కొమ్ము రాజశేఖర్, ఎర్ర కృష్ణ జాంభవ్, కోరే శ్రీనివాస్, మద్దిమడుగు రామస్వామి, నూనె సురేష్, జున్నిద్దయ్య తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

- వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ

**జయభేరి, దేవరకొండ :**




భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) 68వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు దేవరకొండ ఎల్ఐసి బ్రాంచ్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ అల్లంపల్లి నరసింహ,సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, ఎల్ఐసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహాన్ మాట్లాడుతూ.. 1956 సెప్టెంబర్ 1వ తేదీన ఎల్ఐసి రూపొందించబడిందని, జీవిత బీమాను భరింత విస్తృతంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే లక్ష్యంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఎల్ ఐ సి మరింత సేవలు పాలసీదారులకి అందించాలని, అందిస్తారని ఆశిస్తూ, 68 సంవత్సరాల నుండి భారతీయ ప్రజల కోసం అత్యంత విశ్వసనీయ భీమా కంపెనీలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు. బ్రాంచ్ లియాఫీ ప్రెసిడెంట్ నిరంజన్ చౌహన్, ఫెడరేషన్ లీడర్స్ వి లిమియా నాయక్, ఆల్ ఇండియా సెంట్రల్ లీడర్ గాజుల రాజేష్, బుడిగ వెంకటయ్య, నోముల రాములు,శంకర్,సంతోష్ రాణి, లచ్చిరాం, లక్ష్మీనారాయణ, నరేందర్, గెల్వయ్య,శంకరయ్య ఎల్ఐసి ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## భారీ వర్షా ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి, ఘట్కేసార్ ట్రాఫిక్ సీఐ పరశురామ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేయటం జరిగింది. నిన్న కురిసిన భారీ వర్షాల కారణంగా మేయర్ అమర్ సింగ్ మేడిపల్లి సీఐ, ఘట్కేసర్ ట్రాఫిక్ సీఐ వారితో ట్రాఫిక్ సమస్యల గురించి సంభాషించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమిరెడ్డి నవీన్ రెడ్డి, కౌడ పోచయ్య, అనంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి సతీష్, పాశం బుచ్చి యాదవ్, తుంకుంట్ల శ్రీధర్ రెడ్డి, యాసారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.


## ముఖ్యమంత్రి సహాయ నిధి



**జయభేరి, మేడిపల్లి :**

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, కార్పొరేటర్ల సమక్షంలో పీర్జాదిగూడ 4వ డివిజన్ కి సంబంధించిన లబ్ధిదారులు యొక్క చెక్కులు Y.లావణ్య కి రూ.39,000/S.సూర్యకళ కి రూ.30,000/అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆపత్కాలంలో అండగా ఉంటున్నారని వారికి ఎప్పటికి రుణ పడి ఉంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, కౌడ పోచయ్య, బచ్చరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి సతీష్, పాశం బుచ్చి యాదవ్, తుంకుంట్ల శ్రీధర్ రెడ్డి, బైటాంటి ఈశ్వర్ రెడ్డి, యాసరం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ లో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో పాల్గొని వివిధ డివిజన్ల నుండి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన మేయర్ అమర్ సింగ్... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మేయర్ అమర్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వర్ రావు, మేనేజర్ సుదర్శన్, డిఈ సాయినాథ్ గౌడ్, విద్యుత్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న అభిమానులు, కార్యకర్తలు



**జయభేరి, సెప్టెంబర్ 2:**

జన సేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలను మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ జన సేన పార్టీ యువ నాయకులు షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక అనాదాశ్రమంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇక నూతనంగా ఎన్నికైన కార్మిక సంఘానికి ఫర్నిచర్ ను, మరియు పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసులను అందజేశారు. జన సేన అధినేత పవన్ కళ్యాణ్ ఇలాంటి జన్మదినోత్సవ వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## సిపిఆర్ ఎంఎస్ లో వున్న లోపాలు

భిలాష్ పూర్ లో నేడు సిపిఆర్ ఎంఎస్ కమిటీ సమావేశం జరుగుతున్నది. ఈ సమావేశంలో పాల్గొనే జాతీయ సంఘాల నాయకులు రిటైర్డు కార్మికుల సంభందించిన సిపి ఆర్ ఎంఎస్ లో వున్న లోపాల గురించి చర్చించి అమలు జరిగే విధంఘా నిర్ణయాలు చేయాలని కోరుతున్నాము.

1) CPRMS లో అధికారులకు 25లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్నారు కార్మికులకు 8లక్షల వరకు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు ఈ వివక్షను తక్షణం సరి చేయాలి.
2) అధికారులకు మందులు కొనుగోలుకొరకు, రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి 36వెయిల రూపాయలు వారి బ్యాంక్ అకౌంట్ లో జమ చేస్తున్నారు. కార్మికులకు ఏమి చేస్తాలేరు. అధికారులు ఆ మొత్తానికి ఏ లాంటి బిల్లుకు సమర్పించే అవసరం లేదు.
3) కార్మికులకు ఫేస్ వర్కర్లుగా రిటైర్మెంట్ తర్వాత చాల అనారోగ్యానికి గురయ్యారు లైఫ్ టైమ్ కూడా తక్కువ కరోనా నుండి వొక్క జబ్బుకే 8లక్షలు హాస్పిటల్ వారు లాగేసు కున్నంటు న్నారు.
4) కంపెనీ హాస్పిటల్స్ లో రిటైర్డు కార్మికులను అవమానకరంగా చూస్తున్నారు ఆత్మన్యూనతా భావానికి లోనవుతున్నాము.
5) బొగ్గు గనులలో అనేక దశాబ్దాలు అనారోగ్యకర పని ప్రాంతాలలో ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఉత్పత్తి యాగంలో సమీదలం అయి జీవిత చరమాంకంలో బ్రతకడానికి సరిపడ పెన్షన్ రాక. కనీస వైద్య సేవలు పొందలేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు పౌష్టిక ఆహారం తీసుకోవడం గగన కుసుమం అవుతున్నది ఈ పరిస్థితులలో వైద్య సేవలు సరిగా కనిపించాలనీ, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని నేడు భిలాస్పూర్ లో జరిగే సమావేశంలో పాల్గొనే జాతీయ సంఘాల నాయకులు తగిన నిర్ణయాలు చేయాలని సమస్త రిటైర్డు కార్మికులము విజ్ఞప్తి చేస్తున్నాము.

## 7న మద్యం షాపుల బంద్



**జయభేరి, నెల్లూరు, సెప్టెంబర్ 2 :**

ఏపీలో త్వరలోనే కొత్త మద్యం పాలసీ తెరపైకి రానుంది. గత ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించిందని డిజిటల్ పిమెంట్స్ కు అనుమతి ఇవ్వకుండా కేవలం డైరెక్ట్ క్యాష్ తీసుకుంటూ కోట్ల రూపాయలను పక్కదారి పట్టించారు అని కూటమి ప్రభుత్వం మొదటి నుంచీ ఆరోపిస్తోంది. సొంత మద్యం బ్రాండ్లతో అటు ప్రజల ఆరోగ్యం ఇటు ప్రభుత్వ ఖజానా రెండింటికీ దెబ్బకొట్టారు అని ఎన్నికల సమయంలో తీవ్రంగా ప్రచారం చేశారు. నిజానికి నాటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు కాస్త ముందుగా మాత్రమే మద్యం దుకాణాల్లో డిజిటల్ పెమెంట్ లకు అనుమతి ఇచ్చింది. ఇవన్నీ నాటి పాలనపై అనుమానాలు సృష్టించింది అనేది స్పష్టం.ఏపీలో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రకటించిన వైట్ పేపర్స్ లో మద్యం పాలసీ కూడా ఒకటి. ఏకంగా అసెంబ్లీలోనే శ్వేత పత్రాన్ని రిలీజ్ చేసిన చంద్రబాబు గత వైసీపీ పాలనలో మద్యం టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా మద్యం వినియోగం పెరిగిన వేళ పక్క రాష్ట్రాల్లో ఆదాయం పెరిగితే ఏపీలో మాత్రం తగ్గింది అన్నారు. అప్పటి పాలకులు ఏపీ ఖజానాకు రావల్సిన ఆదాయాన్ని సైడ్ ట్రాక్ పట్టించడం వల్లే ఈ పరిస్థితి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారుప్రస్తుతం ఏపీలో మద్యం పాలసీ ఎలా ఉండాలి అనేదాని పై అధ్యయనం చేయడానికి మంత్రులతో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి. ఆ కమిటీలో సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, గొట్టిపాటి రవి, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. వీరు పక్క రాష్ట్రాలు ముఖ్యంగా తెలంగాణలో అమలవుతున్న మద్యం పాలసీలను పరిశీలించి దానికి అనుగుణంగా కొత్త పాలసీకి తగిన సూచనలను ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారు. అనంతరం అక్టోబర్ 1 న ఏపీలో కొత్త మద్యం పాలసీని సీఎం ప్రకటిస్తారు.కొత్త మద్యం పాలసీలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసేసి ప్రైవేటుపరం చేస్తారు అనేది ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. దానితో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇప్పుడు రోడ్డెక్కారు. ముందు తమ ఉద్యోగాల సంగతి తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పేపర్ నోటిఫికేషన్ ఇచ్చి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా తమ ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేశారని కానీ ఐదేళ్లుగా పని చేస్తున్న తమకు సరైన సమయానికి జీతాలు ఇవ్వలేదని వారు అంటున్నారు. పైగా తమకు రావల్సిన PF,OT,ESIల డబ్బును కూడా ఏజెన్సీలు తినేసాయని ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుంది అనుకుంటే ఇలా అర్ధాంతరంగా తమను రోడ్డున పడేశారని వాపోతున్నారు. అందుకే కొత్త మద్యం పాలసీ ప్రకటించేలోపు తమ ఉద్యోగాలపై స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ కోణంలోనే సెప్టెంబర్ 4 నుంచి నిరసనలు చేస్తామని సెప్టెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్ చేపడతామని ఏపీ బేవరేజేస్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం ఏపీలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 18వేల మంది వరకూ పనిచేస్తున్నారు. అన్నివేల కుటుంబాలను ఒక్కసారిగా రోడ్డున పడేయకండి అంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## అవసరం వుంటేనే బయటకు రండి

▸▸ స్పీకర్ ప్రసాద్ కుమార్

**జయభేరి, వికారాబాద్:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారినికి ఎవరు కూడా బయటికి వెళ్లోద్దని తెలంగాణ శాసనసభ పతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ప్రజలకు మరియు వికారాబాద్ నియోజకవర్గ ప్రజలకు పలు సూచనలు తెలియజేశారు. ప్రజలందరికి అదికారులు నాయకులు అన్ని వేలల్లో అందుబాటులో ఉండలని మరియు ప్రజలు ఎవరుకూడా వాగులు వంకలు పొంగి పొర్లుచున్న సందర్భంగా ఎవరు కూడా వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని పాత ఇల్లలో కూడా ఎవరు ఉండొద్దని ఎవరికైనా ఉండటానికి సౌకర్యం లేకపోతే ప్రభుత్వ అదికారులకు సమాచారం అందిస్తే వారు మీకు సహాయం అందిస్తరని మరియు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులకు సమీక్ష సమావేశంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు ఇందుకు రాష్ట్ర ప్రజలందరు కూడా అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

# 2005 తర్వాత... బెజవాడ మునిగింది

**జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 2:**





సరిగ్గా 20ఏళ్ల తర్వాత విజయవాడ నగరం ముంపుకు గురైంది. వాగులు, వంకలు ఆక్రమణకు గురైతే ప్రకృతి కన్నెర చేస్తుందని మరోసారి రుజువైంది. 20ఏళ్ల క్రితం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరు అర్థాంతరంగా నిలిచిపోవడంతో దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు. 20ఏళ్లలో విజయవాడ నగరం ఊహించని వేగంగా విస్తరించడం, బుడమేరు ప్రవాహ మార్గాన్ని కబ్జా చేయడమే ప్రస్తుత పరిస్థితికికారణమైంది.విజయవాడ నగరానికి పక్కగా ప్రవహించే కృష్ణానదికంటే నగరం మధ్యలో ప్రవహించే బుడమేరుతో దశాబ్దాలుగా దానికి ముప్పు పొంచి ఉంది.2005లో చివరి సారి బుడమేరు బెజవాడ పుట్టిముంచింది. 2005సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. విజయవాడ మూడొంతులు ముంపుకు గురైంది. వరదల కారణంగా విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలు సైతం వాయిదా పడ్డాయి. దీనికి ప్రధాన కారణం బుడమేరు ఉగ్రరూపంతో ప్రవహించడమే. రికార్డు స్థాయిలో ఎగువున ఖమ్మం జిల్లా నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో అదంతా విజయవాడను ముంచెత్తింది.ఖమ్మం జిల్లాలో పుట్టే బుడమేరు ఏటా సాధారణ సీజన్‌లో గరిష్టంగా 11వేల క్యూసెక్కుల ప్రవాహంతో ప్రవహిస్తుంది. 2005లో అది 70వేల క్యూసెక్కులకు చేరింది. బుడమేరు ప్రవాహాన్నినియంత్రించడానికి వెలగలేరు వద్ద ఓ రెగ్యులేటర్‌ను కూడా 70వ దశకంలో నిర్మించారు. వెలగలేరు మీదుగా ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, విజయవాడ రూరల్ మీదుగా నగరంలోకి ఇది ప్రవేశిస్తోంది.2005లో వచ్చిన వరదలకు కారణాలను వివరిస్తూ సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు కొల్లి నాగేశ్వరరావు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుడమేరు ముంపుకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కృష్ణా జిల్లాకు ఎప్పటికీ ముంపు పొంచి ఉంటుందని ఆందోళనకు దిగడంతో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా విజయవాడ వచ్చారు. విజయవాడలో ఉన్న వరద పరిస్థితి మొత్తాన్ని ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. బుడమేరు ప్రవాహాన్ని కట్టడి చేయాలంటే దానిని మళ్లించడం ఒక్కటే మార్గమని భావించారు.పోలవరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలో కలిపే డిజైన్ అప్పటికే ఖరారైంది. బుడమేరు ప్రవాహానికి దిగువన పోలవరం కుడికాల్వ కృష్ణానదిలో గుర్తించి అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని అధికారులకు నాటి సీఎం వైఎస్సార్ సూచించారు. విజయవాడ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బుడమేరు మలుపులు సరి చేసి నీటి ప్రవాహం నేరుగా కొల్లేరుకు చేరేలా చూస్తామని, వరదల్లో నీటి ప్రవాహం వెనక్కి ఎగదన్నకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పోలవరం కుడి కాల్వ నిర్మాణంలో భాగంగా 200708 నాటికి బుడమేరు దిగువ ప్రవాహాన్ని కుడి కాల్వలోకి మళ్లించారు. కొత్తగా మరో కాల్వను తవ్వకుండా విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చే జలాలను కృష్ణా నదిలో కలిపే కాల్వలోకి మళ్ళించారు.ఇక్కడే సాంకేతికంగా ఓ సమస్య తలెత్తింది. పోలవరం కుడి కాల్వను గరిష్టంగా 37,500 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా డిజైన్ చేశారు.విటిపిఎస్ మీదుగా ప్రవహించే కాల్వలకు అంత సామర్థ్యం లేదు. వాటిని వరద ప్రవాహానికి అనుగుణంగా పెంచాలని ప్రతిపాదనలు ఉన్నా, థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోపల కాల్వలను విస్తరించే పరిస్థితి లేకపోవడంతో బుడమేరు వరద ప్రవాహానికి అనుగుణంగా కాల్వల సామర్థ్యం పెరగలేదనే వాదన ఉంది. దీనికి తోడు కృష్ణానది ముఖ ద్వారంలో ఉన్న నిర్మాణాలు కూడా వరద ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. విటిపిఎస్ నుంచి కృష్ణా నదిలోకి బుడమేరు వరద నీరు చేరాలంటే కృష్ణానదిలో నీటి మట్టం తగిన స్థాయిలోఉండాలి. కృష్ణా నదిలో ఎగువ నుంచి వరద కొనసాగే సమయంలో బుడమేరు నుంచి వచ్చే వరద ప్రవాహం నదిలోకి చేరదు. అదే సమయంలో పోలవరం కుడి కాల్వ నుంచి నీటి విడుదల కొనసాగితే వరద ప్రవాహం దిగువన విజయవాడ వైపే వెళ్లాల్సి ఉంటుంది.20ఏళ్ల క్రితం వచ్చిన వరదల్లో విజయవాడ నగరంలో న్యూ రాజరాజేశ్వరి పేట, సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. రోజుల తరబడి ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. బుడమేరుకు వెలగలేరు రెగ్యులేటర్ దిగువన మళ్లింపు చేపట్టగానే విజయవాడకు వరద ముంపు తప్పిపోయింది.2008 నుంచి విజయవాడ రూరల్ మండలంలో వేగంగా నిర్మాణాలు విస్తరించాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏకంగా నగరంలో మరో కొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం పరిధిలో న్యూ రాజరాజేశ్వరిపేట ఎక్స్‌టెన్షన్, నందమూరి నగర్ వంటి ప్రాంతాలు విస్తరించాయి. అంతకు ముందు అదంతా బుడమేరు పరివాహక ప్రాంతమనే సంగతిని పూర్తిగా విస్మరించారు.2005లో చేపట్టిన బుడమేరు డైవర్షన్ పనులు పూర్తిగా అటకెక్కిన సంగతి కూడా ప్రజా ప్రతినిధులు విస్మరించారు. బుడమేరు ప్రవాహం విజయవాడ నగరంలోకి రాకుండా ఏర్పాటు చేసిన కరకట్టను 2008 నుంచి పూర్తిగా ధ్వంసం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కరకట్ట ఇప్పుడు ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. సుందరీకరణ పేరుతో నగరానికి రక్షణగా ఏర్పాటు చేసిన వ్యవస్థల్ని రాజకీయ నాయకులు యథేచ్ఛగా ధ్వంసం చేశారు. కాలనీలకు కాలనీలను విస్తరించి నివాస ప్రాంతాలను విస్తరించడంలో 2009 నుంచి విజయవాడలో ఎన్నికైన ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలకు ఇందులో భాగస్వామ్యం ఉంది.బుడమేరు ఉగ్రరూపం దాల్చినపుడు నీటి ప్రవాహానికి అనుగుణంగా పలు చోట్ల మలుపులు ఏర్పడ్డాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం నాలుగైదేళ్ల క్రితం బుడమేరుకు వరదలు వచ్చినా పంట పొలాలు మాత్రమే నీట మునిగేవి. బుడమేరు ప్రవాహంలో ఉన్న మలుపులు నీటి సహజ ప్రవాహ వేగాన్ని తగ్గించి ఊళ్లను ముంచెత్తుతున్నాయని, విజయవాడ, నిడమానూరు ప్రాంతాల్లో ఉన్న "యూ " టర్నింగ్‌లను సవరించాలని 20ఏళ్ల క్రితమే ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది.బుడమేరును ఆక్రమణల నుంచి విడిపించి దాని గరిష్ట సామర్థ్యానికి అనుగుణంగా విస్తరించాలని ప్రతిపాదించారు. విజయవాడ మార్కు రాజకీయం ఆ పనుల్ని అడ్డుకుంది. ఇళ్లను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించడంతో ప్రభుత్వం కూడా వదిలేసింది. ఇదే అదనుగా బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఇక విటిపిఎస్ నుంచి ప్రవహించే వరద ప్రవాహ మార్గంలో ఉన్న నిర్మాణాలు కూడా విజయవాడ ముంపుకు కారణమవుతున్నాయి. వాటిని సరిచేసే సంకల్పం ఏ పార్టీకి లేకపోవడమే ప్రస్తుత పరిస్థితి కారణమైంది.ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి సరస్సుకు నీటిని అందించే నీటి వనరుల్లో బుడమేరు ఒకటి, పశ్చిమగోదావరిలో తమ్మిలేరు, ఎర్రకాల్వలతో పాటు కృష్ణాలో బుడమేరు కొల్లేరుకు ప్రధాన నీటి వనరుగా ఉంటుంది. కొల్లేరులో వరద ప్రవాహాన్ని స్వీకరించకుండా ఆక్రమణలతో నిండిపోవడంతో వరదలు దిగువకు చేరడంలో జాప్యం జరుగుతోంది. ఖమ్మం, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ప్రవహించే వర్షపు నీరంతా బుడమేరు ద్వారా 170కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి కొల్లేరును చేరుతుంది.

# ఈ సారి ఫాంహౌస్ లు టార్గెట్...

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 2:**




విశ్వనగరం హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్)ను ఏర్పాటు చేశారు. పదేళ్లుగా హైదరాబాద్ ఏటా నీటమునుగుతోంది. చిన్న వర్షం పడినా రోడ్లు జలమయమవుతున్నాయి. లోతట్లు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. ట్రాఫిక్ పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. ఈ తరుణంలో సీఎం చేవంత్‌రెడ్డి హైదరాబాద్ వరద సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు హైడ్రాను ఏర్పాటు చేశారు. ఏళ్లుగా ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను చెర విడిపించడమే లక్ష్యంగా హైడ్రా ఏర్పాటు చేశారు. నెల రోజులుగా హైడ్రా తన పని మొదలు పెట్టింది. హైడ్రా కమిషనర్‌గా నియమితులైన రంగనాథ్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా తన పని తాన చేసుకుపోతున్నారు. కోర్టులు కూడా చట్ట ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు ఎవరిపైకి వెళ్లాయో అన్న టెన్షన్ ఆక్రమణదారులను ఆందోళనకు గురి చేస్తోంది. గండిపేట జలాశయంలోని పలు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హోటళ్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నేలమట్టం చేశారు. తాజాగా.. హిమాయత్ సాగర్ జలాశయంలోని నిర్మాణాలపై ఫోకస్ పెట్టారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే అనేకం వందల అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేశారు. హైడ్రాకు సీఎం రేవంత్ రెడ్డి స్వేచ్ఛ ఇవ్వడంతో అధికారులు ఎక్కడా తగ్గటం లేదు. ఎవ్వరినీ వదలకుండా కూల్చివేతల పర్వం కొనసాగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి నివాసానికి కూడా నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 13 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నారు. దీంతో హైడ్రా తర్వాత టార్గెట్ హిమాయత్ సాగర్ జలాశయంగా తెలుస్తోంది. జలాశయంలోని నిర్మాణాలను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమయ్యారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే ప్రక్రియను జలమండలి, రెవెన్యూ అధికారులు చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తెలిసింది. వాటిల్లో పది భారీ నిర్మాణాలను ఇప్పటికే అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీకి చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే ఫాంహౌస్‌తోపాటు మరికొందరు నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. వచ్చే సోమవారానికి ఈ కట్టడాలపై నివేదక పూర్తి చేసి కూల్చివేతలకు సిద్ధమైనట్లు తెలిసింది.హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో శుక్రవారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్‌ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని తేలటంతో నేడు హైడ్రా అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. విక్రమ్ యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి.. కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.






# చీరకట్టులో మనుబాకర్

**2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మను భాకర్ ఇటీవల కౌన్ బనేగా కరోడ్‌పతి సెట్స్ లో కనిపించారు. ఈ చీర ధర, లుక్ గురించి పూర్తి వివరాలు తెల్సుకోండి.**

కౌన్ బనేగా కరోడ్‌పతి సెట్స్‌లో మను భాకర్, అమన్ సెహ్రావత్ కనిపించారు. 2024 పారిస్ ఒలింపిక్స్లో రెండు కాంస్య పతకాలతో దేశం గర్వపడేలా చేసింది ఈ 22 ఏళ్ల అథ్లెట్ మను బాకర్. సాధారణంగా అథ్లెటిక్ లేదా క్యాజువల్ దుస్తుల్లో కనిపించే మను ఈ సందర్భంగా సంప్రదాయ చీరను ధరించి అందరినీ అబ్బురపరిచింది. ఆరు గజాల చీరలో ఆమె అందంగా కనిపించింది. చీరకట్టుతో తనలోని విభిన్న కోణాన్ని చూయించింది మను బాకర్. ఈ సొగసైన చీర లుక్‌ను డీకోడ్ చేద్దాం రండి.

**మను భాకర్ చీర లుక్**

మను చీర ఆకర్షణీయమైన క్రీం రంగులో ఉంది. దానిమీద ఫ్లోరల్ డిజైనింగ్ ఉంది. ఈ చీరను లేయర్డ్ ఫ్రిల్స్ తో డిజైన్ చేశారు. దాంతో సాధారణ చీరకట్టులోనే ట్రెండీగా కనిపించారామె. చీర అంచుకున్న ఎంబ్రాయిడరీ చీరకు మరింత మంచి లుక్ తీసుకొచ్చింది. సాంప్రదాయ చీరకట్టులాగా భుజం మీద పల్లు వేసుకున్నారు. జతగా క్లాసిక్ స్లీవ్ లెస్ బ్లవుజు వేసుకున్నారు. దీనిమీద ప్రింట్స్‌తో పాటూ, బంగారు వర్ణం వర్క్ డీటెలియింగ్ ఉంది. మొత్తం లుక్ అందం పెంచేసిందిది.

**ఆమె చీర ధర ఎంత?**


మీకు మను బాకర్ కట్టుకున్న చీర నచ్చే ఉంటుంది. దాని ధర వివరాలు తెల్సుకుని మీ బీరువాలో తెచ్చి పెట్టేసుకోవచ్చు. ఇది డిజైనర్ బ్రాండ్ గోపీ వైద్ డిజైన్ చేసిన చీర. దీని ధర రూ.58,500/

**యాక్సెసరీలు:**

యాక్సెసరీస్ కోసం మను బాకర్ డైమండ్ స్టడ్స్ ఎంచుకున్నారు. చీర లుక్ హైలెట్ అయ్యేలా తక్కువ ఆభరణాలు వేసుకున్నారామె. చేతికి బంగారు వాచీ పెట్టుకున్నారు. చాలా తక్కువ మేకప్ లుక్ తో న్యూడ్ ఐషాడో, మస్కారా వేసిన కనురెప్పలు, చాలా లైట్‌గా బ్లష్ చేసిన బుగ్గలు, హైలైటర్, న్యూడ్ లిప్‌స్టిక్ తో ఆమె మేకప్ లుక్ పూర్తయ్యింది. సిగ లాగా జుట్టు కట్టుకుని హెయిర్ స్టైల్ పూర్తి చేశారు.

**మను భాకర్ గురించి**

మను భాకర్ ఒక భారతీయ స్పోర్ట్స్ షూటర్, ఒలింపిక్ పతక విజేత. ఆమె పారిస్‌లో జరిగిన 2024 ఒలింపిక్స్‌లో గొప్ప విజయాన్ని సాధించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ లో ఒకటి కాక రెండు కాంస్య పతకాలు సాధించి, ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్ గా రికార్డు సృష్టించింది.



# అధరహో అనిపించాలంటే

**అతివల పెదాల గురించి వర్ణించాలంటే పదాలు సరిపోవు. అయితే, గులాబీ రేకుల్లాంటి పెదాలు కంటపడితే దేవదాసు సైతం కాళిదాసుగా మారిపోతాడు. మరి మీ మోవి గని మోజుపడాలంటే.. అధరాలు తేనెలూరాలి. అలా ఉండాలంటే.. ఇదిగో ఇవి ప్రయత్నించండి..**

ఒక టేబుల్ స్పూన్ కలబంద జెల్‌లో కొద్దిగా తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని పెదాలకు రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. దాంతో పెదాలు హైడ్రేటెడ్‌గా మారుతాయి. సాఫ్ట్‌లుక్‌తో మెరుస్తాయి.

ఆరోగ్యంతోపాటు అందానికి కూడా బీట్‌రూట్ ఉపయోగపడుతుంది. బీట్‌రూట్ రసాన్ని వేళ్లతో పెదాలపై మెత్తగా రుద్దాలి. కాసేపటి తర్వాత శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. మీ పెదాలు వర్ణరంజితమై ముద్దులొలుకుతాయి.

ఒక టీ స్పూన్ ఆల్మండ్ ఆయిల్, టీ స్పూన్ తేనె, రెండు స్పూన్ల చక్కెర ఒక కప్పులోకి తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై మెల్లగా రుద్దాలి. దీనివల్ల పెదాలపై ఏర్పడిన డెడ్‌స్కిన్ తొలగిపోతుంది. మోవిపై ఉన్న నల్లదనం మాయమై నల్ల ఇరుక్కే అనిపిస్తాయి.


వెట్ న్యాప్‌కిన్‌తో గానీ, మెత్తని టూత్‌బ్రష్‌తో గానీ పెదాలపై మెల్లగా రుద్దాలి. దీని వల్ల పెదాలపై డ్రైగా ఏర్పడిన లేయర్ తొలగిపోతుంది. దీనివల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే ముందు ఇలా చేయడం మంచిది. తర్వాత పెదాలకు కొబ్బరినూనె రాసుకుంటే మరీ మంచిది.



# పిల్లల్లో అనారోగ్యకర లక్షణాలు

**మీ పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో ఉందని చెప్పే ఐదు ముఖ్యమైన సంకేతాలు ఇవే, వీటిని నిర్లక్ష్యం చేయకండి**

**తల్లిదండ్రులు తమ కన్నా పిల్లల గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. అయితే పిల్లలు చూపించే కొన్ని రకాల లక్షణాలను తేలిగ్గా తీసుకోకూడదు. ఇక్కడ చెప్పే సంకేతాలు వారి ఆరోగ్యం ప్రమాదంలో ఉందని హెచ్చరించేవి.**



తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం నిత్యం ఆలోచిస్తూ ఉంటారు. వారు ఆరోగ్యంగా ఉండాలనీ, సంతోషంగా జీవించాలని కోరుకుంటారు. పిల్లలను ఎక్కువగా గమనించేది తల్లిదండ్రులే. ఎంత గమనించినా కూడా కొన్ని రకాల లక్షణాలను వారు నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంది. అలా చేస్తే మీ పిల్లలు ప్రమాదంలో పడినట్టే. మీ పిల్లల్లో ఇక్కడ చెప్పిన ఐదు లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్త పడండి. ఇవి వారి ఆరోగ్యం ప్రమాదంలో పడిందని చెప్పే సంకేతాలు.

**త్వరగా అలసిపోవడం**

ఆడుకున్నప్పుడు లేదా శారీరక శ్రమ చేసినప్పుడు మీ పిల్లలు చాలా తక్కువ సమయానికి అలసిపోవడం, ఎగశ్వాస పీల్చుకోవడం వంటివి కనిపిస్తే తేలిగ్గా తీసుకోకండి. పిల్లలు ఎక్కువ సేపు ఆడగలరు. అసాధారణంగా అలసిపోవడం అనేది వారిలో కనిపించే ఒక అరుదైన లక్షణం. ఇది ఆస్తమా, హృదయ సంబంధిత సమస్యలకు కారణం కావచ్చు. రక్తహీనత, శ్వాసకోశ సమస్యల సంకేతంగా కూడా భావించవచ్చు. ఇది వారి శక్తి స్థాయిలను, శ్వాస విధానాలను సూచిస్తుంది. కాబట్టి పిల్లలు ఎంతసేపటికి అలసిపోతున్నారు? ఆడగలుస్తున్నారా? ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

**హోమ్ ఫుడ్ ఇష్టపడకపోతే**

సాధారణంగానే పిల్లలు ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తినడానికి ఇష్టపడరు. బయటకొన్న ఆహారాలను ఇష్టంగా తింటారు. అలా అని ప్రతిరోజూ వాటిని తినరు. ఇంట్లో వండిన ఆహారాన్ని కూడా తింటూ ఉంటారు. హోమ్ మేడ్ ఫుడ్‌ను తింటూనే బయట ఆహారాన్ని అడుగుతారు. అలా కాకుండా ఇంట్లో వండిన ఏ ఆహారాన్ని తినడానికి ఇష్టపడకుండా, కేవలం బయట నుంచి కొన్న ఫుడ్‌ను మాత్రమే తింటే అది వారి మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తుంది. పోషకాహార లోపం వల్ల, జీర్ణ సమస్యలు, భావోద్వేగాల సమస్యల వల్ల, మానసిక ఒత్తిడి వల్ల వారు ఇంటి ఆహారాన్ని ఇష్టపడరు. కాబట్టి వారి ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా పడండి. ఇలా హోం మేడ్ ఫుడ్‌ను తినకుండా పూర్తిగా బయట ఆహారాన్ని తింటున్నారంటే వారిపై మీరు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందే.

**నడుము కొలత పెరిగితే**


సాధారణంగా పిల్లలు సన్నగా లేదా కాస్త బొద్దుగా ఉంటారు. సన్నగా ఉన్నా కూడా పైనుంచి కింద వరకు ఒకే పరిమాణాన్ని, ఆకారాన్ని కలిగి ఉంటారు. అలాగే బొద్దుగా ఉన్నవారు కూడా బుగ్గల నుంచి కింద పిరుదుల వరకు బొద్దుగా ఉండే శరీరాన్ని కలిగి ఉంటారు. అలా కాకుండా కేవలం నడుము దగ్గర, పిరుదుల దగ్గర లావు పెరిగి మిగతా శరీరం అంతా సన్నగా ఉంటే అది ఆరోగ్యానికి మంచి సంకేతం కాదు. ఇది రాబోయే కాలంలో వారు ఊబకాయం బారిన పడుతున్నారు అని చెప్పే లక్షణం. ఇది మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులను కూడా సూచిస్తుంది. వారి ఎదుగుదలపై కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి మీ పిల్లలు కేవలం నడుము భాగంలోనే అధికంగా లావుగా కనిపిస్తున్నట్లయితే జాగ్రత్తపడింది.

**రాత్రిపూట నిద్ర పట్టకపోవడం**

నిజానికి పిల్లలు శారీరకంగా, మానసికంగా అలసిపోతారు. వారు ఉదయం నుంచి ఆడుకోవడానికి ప్రయత్నిస్తారు. ఏదో ఒక పని చేయడానికి ఇష్టపడతారు. మధ్యాహ్నం పిల్లలు నిద్రపోవడానికి ఇష్టపడరు. కానీ రాత్రి మాత్రం వారికి చాలా త్వరగా నిద్ర కమ్మేస్తుంది. కానీ మీ పిల్లవాడు రాత్రిపూట ఎనిమిది గంటలు ప్రశాంతంగా నిద్ర పోకుండా ఇబ్బంది పడుతున్నాడంటే అతనిలో ఏవో ఆరోగ్య సమస్యలు ఉన్నాయని అర్థం. పేలవమైన నిద్ర, మానసిక స్థితిని, మానసిక ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. తద్వారా వారి చదువు కూడా తగ్గిపోతుంది. కాబట్టి వారు నిద్ర విధానాలను గమనించండి. వారు నిద్రపోవడం, నిద్ర లేవడం ప్రశాంతంగా జరుగుతోందా? రాత్రంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారా? లేదా అనేది గమనించండి. వారిలో పీడకలలు రావడం, తరచుగా మేల్కొంటూ ఉండడం వంటివి వారి ఆరోగ్యం ప్రమాదంలో ఉందని చెప్పే సంకేతాలు.




## కంగనారనౌత్‌కు ఎమర్జెన్సీ కష్టాలు..



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా, 197577 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో రూపొందిస్తున్న 'ఎమర్జెన్సీ' సినిమా విడుదలను వాయిదా వేయాలని కేంద్ర సెన్సార్ బోర్డ్ చిత్ర నిర్మాతలను ఆదేశించింది. ఇందిరా గాంధీ పాత్రను పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఈ నెల 6న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే సినిమాలో ఓ వర్గం మనోభావాలను కించపరిచారని, ఆపరేషన్ బ్లూస్టార్ నేపథ్యంలో మతపరంగా సున్నితమైన అంశాలు ఇందులో ఉన్నాయని సెన్సార్ బోర్డ్ చిత్రాన్ని వాయిదా వేసింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఢిల్లీ సిక్కు గురుద్వార మేనేజ్‌మెంట్ కమిటీ కేంద్ర సెన్సార్ బోర్డ్‌కు లేఖ రాసింది. ఈ సినిమా ట్రైలర్‌లో తమ వర్గంపై అనుమానం రేకెత్తించేలా సున్నితమైన అంశాలను ప్రస్తావించారని, అవాస్తవాలను చూపించారని గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇదిలావుండగా ఈ సినిమాపై నిషేధం విధించాలని దేశవ్యాప్తంగా పలు సిక్కు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## రీటేక్.. అనే పదమే నా చెవులకు ఇంపు




అనుపమా పరమేశ్వరన్ స్పీడ్ మామూలుగా లేదు. 'టిల్లూ స్కేర్'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం షూటింగ్‌ల్లో బిజీబిజీ. ఈ అందాలభామ చేతిలో ప్రస్తుతానికి ఆరు సినిమాలున్నాయి. వచ్చే ఏడాది వరకూ కొత్త సినిమాలకు డేట్స్ ఇచ్చే పరిస్థితి లేదట. అంత బిజీ ప్రస్తుతం అనుపమ. రీసెంట్‌గా తన నట ప్రయాణం గురించి ఆసక్తికరంగా మాట్లాడింది అనుపమ.. 'కంఫర్ట్ జోన్‌లో సినిమాలు చేయడం నాకు అస్సలు నచ్చదు. అలా పనిచేయడం చాలా బోరింగ్. భిన్నమైన సినిమాల ప్రయాణమంటేనే నాకిష్టం. ప్రయోగాత్మకమైన పాత్రలు చేసినప్పుడు కలిగే సంతృప్తి గురించి మాటల్లో చెప్పలేం. నటిగా ఛాలెంజిగ్ రోల్స్‌నే ఎక్కువగా ఇష్టపడతా. సెట్‌లో డైరెక్టర్ రీటేక్స్ అడిగినప్పుడు నాలో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఎన్ని టేకులైనా విసుగు లేకుండా చేస్తా. 'బాగా నటించావ్' అనే పదం కంటే 'రీటేక్' అనే పదమే నా చెవులకు ఇంపుగా ఉంటుంది. అలా ఉంటేనే నటనలో మరింత పరిపక్వత పొందగలం' అంటూ చెప్పుకొచ్చింది అనుపమ.

## దేవర డ్యుయెట్‌కు ఫ్లోర్ దద్దరిల్లిపోవాల్సిందే..

ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్‌గా పాపులర్ అయ్యాడు టాలీవుడ్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్. తారక్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న తాజా పాన్ ఇండియా మూవీ దేవర. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. దేవర పార్టు 1 సెప్టెంబర్27 న గ్రాండ్‌గా విడుదలవుతుంది. దేవర థర్డ్ సింగిల్‌దావుడి త్వరలోనే లాంచ్ చేస్తున్నాం. ఈ మాస్ డ్యుయెట్ తారక్‌జాన్వీకపూర్ మధ్య ఉండబోతుందని అనిరుధ్ రవిచందర్ ప్రకటించాడని తెలిసిందే. తాజాగా దావుడి సాంగ్ లుక్ రిలీజ్ చేస్తూ కొత్త వార్తను షేర్ చేసింది కొరటాల టీం. ప్రతీ ఒక్కరితో డ్యాన్స్ చేయించే బీట్స్‌తో దావుడి సాంగ్ సెప్టెంబర్ 4న రాబోతుందని ట్వీట్ చేశారు మేకర్స్. మరో బ్లాక్ బస్టర్ హిట్ సాంగ్ పక్కా అని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా దేవర నుంచి విడుదల చేసిన ఫియర్, చుట్టమల్లె సాంగ్స్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాయి. ఇటీవలే భయం ముఖ చిత్రాలు.. అంటూ కొంచెం నవ్వు.. మరికొంచెం రౌద్రరూపంలో కనిపిస్తున్న తారక్ లుక్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. దేవరలో ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. దేవరతో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుంది.



## 'బొంబాయి' నన్ను ఏడిపించింది..



దక్షిణాది సినీరంగంలో ప్రయోగాత్మక పాత్రల ద్వారా విలక్షణ నటుడిగా గుర్తింపును సంపాదించుకున్నాడు అగ్ర హీరో విక్రమ్. ఆయన తాజా చిత్రం 'తంగలాన్'కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ సందర్భంగా ఓ విజయోత్సవ సమావేశంలో పాల్గొన్న విక్రమ్ 'బొంబాయి' సినిమాలో తాను హీరోగా నటించే అవకాశాన్ని కోల్పోవడం ఎంతగానో బాధించిందని చెప్పారు. కల్ట్ క్లాసిక్ నిలిచిన సినిమాను మిస్ చేసుకోవడం కెరీర్‌లో చేసిన పెద్ద తప్పిదమని విక్రమ్ అన్నారు. 'మణిరత్నం వర్కింగ్‌స్టైల్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డైరెక్షన్‌లో నటించిన తర్వాత ఇండస్ట్రీ నుంచి తప్పుకున్నా ఫర్వాలేదు అనుకునేవాడిని. ఈ క్రమంలో 'బొంబాయి' సినిమాలో ఛాన్స్ వచ్చింది. హీరోగా నన్ను దాదాపు ఖరారు చేశారు. అయితే ఆడిషన్ సందర్భంగా నేను చేసిన చిన్న తప్పిదం వల్ల సినిమా మిస్ అయింది. స్టిల్ కెమెరా నా ముందు పెట్టి సీన్‌లో నటించమని చెప్పారు. స్టిల్ కెమెరా ముందు యాక్ట్ చేయడమేంటి? అనే భావనతో నేను సీన్ చేయకుండా అలాగే ఉండిపోయా. దాంతో నన్ను తప్పించారు. 'బొంబాయి' జాతీయ స్థాయిలో కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. ఆ సినిమా విడుదలైన తర్వాత రెండు నెలలు ఎంతో ఆవేదన చెందాను. రోజూ ఉదయం లేవగానే ఏడుస్తూ కూర్చునేవాణ్ణి' అని విక్రమ్ తెలిపారు. 'బొంబాయి' సినిమా మిస్ అయినప్పటికీ.. ఆ తర్వాత మణిరత్నం దర్శకత్వం వహించిన 'రావణ్' 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాల్లో విక్రమ్ కథానాయకుడిగా నటించారు.

## పని విషయంలో లింగ వివక్షత ఉండకూడదు

మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదిక అక్కడి ఇండస్ట్రీని కుదిపేస్తున్న విషయం తెలిసిందే. ఈ నివేదికను ఇండస్ట్రీకి చెందిన స్టార్ నటీనటులు స్వాగతిస్తూ.. హేమ కమిటీని అభినందిస్తున్నారు. ఇక ఈ కమిటీ నివేదకను ఇప్పటికే స్వాగతించిన టాలీవుడ్ స్టార్ నటి సమంత తాజాగా మరోసారి స్పందించారు. పని విషయంలో లింగ వివక్షత ఉండకూడదని పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో మార్పు అవసరమని.. వర్క్‌ప్లేస్‌ను పునరుద్ధరించుకుందామంటూ సోషల్ మీడియా వేదికగా ఆమె పోస్ట్ పెట్టారు.జస్టిస్ హేమ కమిటీ నివేదిక విడుదలైన తర్వాత చిత్ర పరిశ్రమలోని మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి, తమ చేదు అనుభవాల గురించి చెబుతున్నారని సామ్ తెలిపారు. పని ప్రదేశాల్లో ఏ రూపంలో లింగవివక్ష చూపినా అది లైంగిక వేధింపుల మాదిరిగానే ఉంటుందని హేమ కమిటీ పేర్కొన్నట్లు చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను నివేదిక సిఫార్సు చేసిందని తెలిపారు. లింగ వివక్ష లేని వాతావరణాన్ని ఇండస్ట్రీలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలిసి ముందుకు నడవాల్సిన సమయం ఇది అని సామ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.కాగా, హేమ కమిటీ రిపోర్ట్‌పై సామ్ ఇప్పటికే రెండుసార్లు స్పందించిన విషయం తెలిసిందే. హేమ కమిటీ రిపోర్ట్‌ను స్వాగతించారు. చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల సమస్యను తెరపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన కేరళలోని విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యుసీసీ) ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి సామ్ కీలక విజ్ఞప్తి చేశారు. డబ్ల్యూసీసీని స్ఫూర్తిగా తీసుకొని.. టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనూ 2019లో 'ది వాయిస్ ఆఫ్ విమెన్' ఏర్పాటైందని గుర్తు చేశారు. టాలీవుడ్‌లో మహిళల సమస్యలపై పోరాడేందుకు రూపొందించిన ఈ సబ్ కమిటీ నివేదికను పబ్లిష్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com